క్లుప్తంగా

4,847 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో గురువారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరాల్లో 4,847 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. 387 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 3,47,375 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 51,760 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు.

గ్రామ సంఘాల ఆడిట్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల సమాఖ్యతోపాటు మండలంలోని 33 గ్రామ సంఘాలకు సంబంధించిన రికార్డులకు గురువారం ఐకేపీ కార్యాలయంలో అధికారులు ఆడిట్ నిర్వహించారు. 2022–23కు సంబంధించిన పుస్తకాలను చార్టెడ్ అకౌంటెంట్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆడిట్ చేశారు. నివేదికను 15 రోజుల్లో అందిస్తామని వారు చెప్పారు. ఏపీఎం జగదీశ్, రాజు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన కామిండ్ల చంద్రం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, అతడి చిన్ననాటి మిత్రులు గురువారం రూ.22,500 ఆర్థిక సాహం అందజేశారు. చంద్రం మిత్రులు నల్లపు శ్రీనివాస్, అబ్రబోయిన స్వామి, పిన్నం రాంచంద్రం, బత్తిని సిద్దరాములు, సందెల అబ్బయ్య, షమ్మీ, చెన్నం రవి, కదిరె లక్ష్మారెడ్డి, పందిరి శేఖర్ ఉన్నారు.

ఫ్యాక్టరీని మూసేయాలని దీక్ష

భిక్కనూరు: మండల కేంద్రం శివారులోని ఎంఎస్ఎన్ కెమికల్ ఫ్యాక్టరీని వెంటనే మూసేయాలని డిమాండ్ చేస్తూ భిక్కనూరు మండలం కాచాపూర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు గురువారం మూడవ రోజుకు చేరుకున్నాయి. ఎంఎస్ఎన్ కెమికల్ ఫ్యాక్టరీ వద్దు రా.. పుట్టిన ఊరు ముద్దురా అంటూ నినాదాలు చేస్తూ దీక్షలో కూర్చున్నారు. దీక్షలకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీంరెడ్డి మద్దతు తెలిపారు.

మోడల్ ఎంసెట్ విజయవంతం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సాందీపని జూనియర్ కళాశాలలో నిర్వహించిన మోడల్ ఎంసెట్ ఆన్‌లైన్ పరీక్ష విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్ కుమార్ మాట్లాడుతూ..విద్యార్థులకు మోడల్ పరీక్షలు నిర్వహించడం ద్వారా పరీక్షల పట్ల ఉన్న భయం తొలగిపోతాయని అన్నారు. సాందీపని విద్యాసంస్థల డైరెక్టర్ బాలాజీ రావ్, ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు, శ్రీ ఆర్యభట్ట కళాశాల ప్రిన్సిపాల్ గురువేందర్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ నేతలు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని శివాపూర్ గ్రామ శివారులో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయి కలుషితమవుతుంది. మిషన్ భగీరథ నీరు కలుషితమై పచ్చ రంగులో వస్తున్నాయని, దుర్వాసన కూడా వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నగదు చోరీకి యత్నం

ఎల్లారెడ్డి: ఏటీఎంలోకి వెళ్లి అందులో నుంచి డబ్బులను దొంగిలించాలని ప్రయత్నించిన నిందితుడిని ఎల్లారెడ్డి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. సబ్దల్పూర్ గ్రామానికి చెందిన కల్యాణ్ బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ఎస్‌బీఐ ఏటీఎంలోకి డబ్బులు డ్రా చేయడానికి వెళ్లినట్లు ఏమార్చి ఏటీఎం మెషిన్‌లోని కొన్ని పరికరాలను ధ్వంసం చేసి డబ్బులు కాజేయడానికి ప్రయత్నించాడు. ఈ విషయం బ్యాంక్ అధికారులకు అలారం ద్వారా తెలియడంతో వారు తమకు సమాచారం ఇచ్చినట్లు ఎస్సై గణేష్ తెలిపారు. తాము సీసీ ఫుటేజ్ ద్వారా నిందితుడిని గుర్తించి అరెస్టు చేసినట్లు ఆయన వివరించారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

ఎల్లారెడ్డి: అకాలవర్షం కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు తహసీల్దార్ నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. కల్లాలలో తడిసిపోయిన రైతుల ధాన్యాన్ని ఎలాంటి తరుగు లేకుండా భేషరతుగా కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. నేతలు ఎస్ఎస్ రెడ్డి, కురుమ సాయిబాబా, మర్రి బాలకిషన్, సతీష్ పాల్గొన్నారు.

'కనీస సౌకర్యాలు కల్పించడం లేదు'

ఎల్లారెడ్డిరూరల్: అకాల వర్షాల కారణంగా కల్లాలలో తడిచిన ధాన్యం ఆరబెట్టుకునేందుకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని సీపీఐ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ చేపట్టిన ఆటో జాత గురువారం ఎల్లారెడ్డి చేరుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు కేంద్ర కమిటీ నాయకులతో ఆటో జాత కార్యక్రమాన్ని చేపట్టింది. కార్యక్రమంలో భాగంగా సీపీఐ నాయకులు మార్కెట్ కమిటీ ఆవరణలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



మద్నూర్‌లో ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న వీవోఏలు



నిజాంసాగర్‌లో ఆందోళన చేస్తున్న వీవోఏలు

తమ సమస్యలు పరిష్కరించాలంటూ జిల్లాలో ఐకేపీ వీవోఏలు చేస్తున్న ఆందోళనలు గురువారం కొనసాగాయి. కనీస వేతనం రూ.26 వేతనం చెల్లించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఐడీ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే రూ.10 లక్షల బీమా కల్పించాలని, వేతనం డీఆర్‌డీఏ శాఖ అకౌంట్ నుంచి నేరుగా వీవోఏలకు ఇవ్వాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని వీవోఏలు స్పష్టం చేశారు. వివిధ రకాలుగా నిరసనలు తెలియజేస్తామన్నారు.

– సాక్షినెట్‌వర్క్



లింగంపేటలో ..



ఎల్లారెడ్డిలో ..



పెద్దకొడప్‌గల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం

ట్యాంక్ బండ్‌పై ఐలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు గోపి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ అంటూ కొనియాడిన సీఎం కేసీఆర్ గద్దెనెక్కిన తర్వాత ఆ మాట మర్చి పోయాడన్నారు. ట్యాంక్ బండ్‌పై ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయకపోవడానికి కారణం ఏమిటో వివరించాలన్నారు. ఆమె జన్మించిన జనగామ జిల్లాకు చాకలి ఐలమ్మ జిల్లాగా నామకరణం చేయాలని కోరారు.

ఐలమ్మ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పద్మాజివాడి గ్రామ స్టేజీ వద్ద ఐలమ్మ విగ్రహ నిర్మాణం కోసం సర్పంచ్ మడిపెద్ది కవిత ఆనంద్ గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...రజక సంఘం ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ లింగారెడ్డి, ఉప సర్పంచ్ రజియొద్దిన్, రజక సంఘం మండలాధ్యక్షుడు తిమ్మజాడ రాజన్న పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న రజక సంఘం నేతలు

బాన్సువాడలో కేంద్ర మంత్రి ర్యాలీ

బాన్సువాడ : బాన్సువాడ పట్టణంలో గురువారం కేంద్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి పరుషోత్తం రూపాలా ర్యాలీ నిర్వహించారు. కొయ్యగుట్ట వద్ద అమరవీరుల స్థూపాలకు పూలమాల వేసి వాహనాలపై బాన్సువాడకు చేరుకున్నారు. పాత అంగడిబజారు నుంచి గాంధీచౌక్, డెయిలీ మార్కెట్, రాజీవ్‌చౌరస్తా మీదుగా అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, బాన్సువాడ ఇన్‌చార్జి మాల్యాద్రిరెడ్డి, నేతలు కొత్తకొండ భాస్కర్, శ్రీనివాస్, కోనాల గంగారెడ్డి, తదితరులున్నారు.

శ్రీ కృష్ణ మందిరంలో పూజలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): లింగంపల్లి శ్రీ కృష్ణ మందిరంలో కేంద్ర మంత్రి పూజలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల నాయకులు ఘన స్వాగతం పలికారు. మచాలే బాబా, ఆలయ విశిష్టత గురించి వివరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణ తార, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, నాయకులు భూంరావు, గంగారెడ్డి, మహిపాల్ రెడ్డి, జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.



పాల్గొన్న కేంద్ర మంత్రి రూపాలా, కార్యకర్తలు

లిఫ్ట్ మిల్లర్ కార్మికుల సమస్యల్ని పరిష్కరించండి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఉన్న లిఫ్ట్ మిల్లర్స్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో లిఫ్ట్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సుమారు 150కి పైగా లిఫ్ట్ మిల్లర్లు ఉన్నారని, వారి వద్ద సుమారు 3000 మంది కార్మికులు నిత్యం పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారని తెలిపారు. జిల్లాలోని బిల్డింగ్ అసోసియేషన్ సంఘం ప్రతినిధులు కొత్త సంఘంగా ఏర్పడి ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర నుంచి మిల్లర్లను తీసుకోస్తూ లోకల్‌లో ఉన్న మిల్లర్స్ నిర్వాహకుల, కార్మికుల పొట్ట కొడుతున్నారని తెలిపారు. స్థానికులకే పని ఇవ్వాలని కోరారు. వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిలు, లిఫ్ట్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఉన్నారు.



మాట్లాడుతున్న వెంకట్ గౌడ్

నిరుద్యోగ యువతపై సర్వే



దోమకొండ/భిక్కనూరు: దోమకొండ మండలం లింగుపల్లి, భిక్కనూరు మండలం లక్ష్మీదేవునిపల్లిలో గురువారం తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్–5 ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతపై సర్వే చేసినట్లు ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ బందెల అంజయ్య తెలిపారు. గ్రామంలో ఉన్న 15–29 ఏళ్ల యువతీ యువకులపై నిరుద్యోగం, చదువు, ఆర్థిక స్థితిగతులు, చదువు మధ్యలో మానేయడానికి గల కారణాలు, తదితర విషయాలపై కేంద్ర యువజన క్రీడల మంత్రిత్వ శాఖ సూచన మేరకు సర్వే నిర్వహించారు. సర్పంచ్ సాయిలు పాల్గొన్నారు.

వైభవంగా బేతాళస్వామి జాతర



బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలో ప్రతి ఏడాది నిర్వహించే బేతాళ స్వామి జాతర వేడుకలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా గురువారం ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఎడ్లబండ్లను బాగా అలంకరించిన రైతులకు మున్సిపల్, మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నగదు ప్రదానం చేశారు. ఉదయం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆలయంలో పూజలు చేశారు. ప్రతియేటా భక్తిశ్రద్ధలతో బేతాళస్వామి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారని, తాను చిన్నప్పటి నుంచి చూస్తున్నానని పేర్కొన్నారు. నేడు కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గడిరెడ్డి తెలిపారు.

ఈ-సంజీవని సేవలు బలోపేతం చేయాలి



బాన్సువాడ : ఈ–సంజీవని సేవలను మరింత బలోపేతం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శిరీష అన్నారు. గురువారం బాన్సువాడ మాత శిశు సంరక్షణ ఆస్పత్రిలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్య పరీక్షలు, సేవలపై అవగాహన కల్పించారు. టీబీని 2025 నాటికి దేశంలో రూపుమాపాలని, రాష్ట్రంలో మన జిల్లాను ఈ–సంజీవని సేవలో ప్రథమ స్థానంలో నిలిచేలా కృషిచేయాలనిసూచించారు.

'సర్టిఫికెట్లు అడిగితే రికార్డులు లేవంటున్నారు'



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని జీవీఎస్ కళాశాలలో చదువుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇప్పించాలని కలెక్టర్ కార్యాలయ ఏవో రవీందర్‌కు గురువారం ఎన్ఎస్‌యూఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్ మాట్లాడుతూ.. జీవీఎస్ కళాశాలలో అడ్మిషన్ లేక గతంలోనే నిర్వహణ నిలిపివేశారన్నారు. ఇప్పుడు ఉన్నత చదువుల కోసం గతంలో చదివిన విద్యార్థులు టీసీ, బోనఫైడ్, మెమో, ఇతర సర్టిఫికెట్లు అడిగితే రికార్డులు లేవని సమాధానం చెబుతున్నారని అన్నారు. తక్షణమే చర్యలు తీసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి

– కలెక్టరేట్ వద్ద ఆందోళన



కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జూనియర్ పంచాయితీ కార్యదర్శులను రెగ్యూలరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో ఉద్యోగులు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. సీఎస్ఐ చర్చి నుంచి పట్టణంలో ప్రధాన రోడ్ల గుండా ర్యాలీ నిర్వహిస్తూ కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రొబెషనరీ కాలం నాలుగేళ్లు పూర్తయినా ఇప్పటి వరకు తమను రెగ్యూలరైజ్ చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ జేపీఎస్‌లను జూనియర్ కార్యదర్శులుగా మార్చాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యాసుఫ్, అశ్వక్, భాస్కర్, మహేశ్ పాల్గొన్నారు.

ఎకరాకు రూ.20 వేల నష్టపరిహారం ఇవ్వాలి

మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి



భవానిపేటలో రోదిస్తున్న మహిళా రైతును ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీందర్ రెడ్డి

లింగంపేట(ఎల్లారెడ్డి): ఈదురు గాలులు, వడగళ్ల వానకు నష్టపోయిన రైతులకు తక్షణమే ప్రభుత్వం ఎకరాకు రూ.22 వేల నష్టపరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం భవానిపేట, మెంగారం, ఎల్లారం, ముస్తాపూర్, లింగంపేట తదితర గ్రామాల్లో ఆయన వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించే వరకు పోరాడుతామన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చే వరకు బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే గంగారాం



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

నిజాంసాగర్(జుక్కల్): దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలన, కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగాయని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం అన్నారు. గురువారం ఆరేపల్లి, బ్రాహ్మణపల్లి, వెల్గనూర్, మంగ్లూర్, నర్సింగ్‌రావ్‌పల్లి గ్రామాల్లో ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ, హాథ్‌సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. నేతలు రవీందర్‌రెడ్డి, అరవింద్, సర్దార్, రమేష్‌గౌడ్, ఆకాష్ ఉన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

దోమకొండ: వడగండ్ల వానతో తీవ్రంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రయ్యగారి అనంతరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పార్టీ నేతలతో కలిసి మాట్లాడారు. రైతులు ఎకరాకు రూ.40 వేల పెట్టుబడి పెట్టారని, ప్రభుత్వం వెంటనే పంట నష్టం సర్వే చేయించి రైతులను ఆదుకోవాలన్నారు. సమావేశంలో నేతలు సీతారం మధు, సిద్దారెడ్డి, గోపాల్‌రెడ్డి, బాల్‌రాజ్, రమేష్, ప్రసాద్, రాములు, లింగం ఉన్నారు.

రూ.30 వేలు ఇవ్వాలి

బాన్సువాడ: రెండు రోజుల క్రితం బాన్సువాడ ప్రాంతంలో కురిసిన వడగళ్ల వర్షానికి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30 వేల నష్ట పరిహారం అందజేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కాసుల బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. గురువారం కొయ్యగుట్ట, తాడ్కోల్, మొగులాన్‌పల్లి శివారుల్లో వర్షానికి దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. నాయకులు హన్మండ్లు, ఖలేక్, గణేష్, తదితరులున్నారు.

దళారులకు విక్రయించి మోసపోవద్దు



తిప్పాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ గాలిరెడ్డి



తిర్మన్‌పల్లిలో .. విండో చైర్మన్

సాక్షి నెట్‌వర్క్:రైతులు పండించిన వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని ప్రజాప్రతినిధులు సూచించారు. గురువారం జిల్లాలో పలు చోట్ల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ వరి ధాన్యానికి రూ.2060, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2040 చెల్లిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్న వివరించారు.



ఖండెబల్లూర్‌లో.. సొసైటీ చైర్మన్ శివానంద్ పటేల్



బ్రాహ్మణపల్లిలో .. సొసైటీ చైర్మన్ శఫ్థంరెడ్డి



మెక్కాలో ..బిచ్కుంద ఎంపీపీ అశోక్



లింగంపేట పరిధిలో .. చైర్మన్ దేవేందర్‌రెడ్డి

పంట నష్టం వివరాల సేకరణ

గాంధారి(ఎల్లారెడ్డి): వడగళ్ల వానకు నష్టపోయిన పంటల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో సేకరిస్తున్నారు. గురువారం ఏవో నరేష్, ఏఈవోలు మండల పరిధిలోని గండివేట్, సీతాయిపల్లి, సర్వాపూర్, ముదెల్లి తదితర గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని అన్నారు.

ఎర్రకుంటతండాలో మొలకెత్తిన ధాన్యం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎర్రకుంటతండాలో రైతులు ఆరబోసిన ధాన్యం రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి తడిసిపోయింది. ధాన్యంలో గురువారం మొలకలు వచ్చాయి. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మొలకలు రాని ధాన్యాన్ని అధికారులు వెంటనే కొనుగోలు చేయాలని వారు వేడుకుంటున్నారు. మొలకలు వచ్చి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

నిజాంసాగర్ పరిధిలో 590 ఎకరాల్లో ..

నిజాంసాగర్(జుక్కల్): వడగండ్ల వర్షానికి 590 ఎకరాల్లో పంట నష్టం వాటిలినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి అమర్‌ప్రసాద్ తెలిపారు. గురువారం ముగ్దుంపూర్ శివారులో నేలవాలిన పంటలను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. నర్వ శివారులో 80 ఎకరాల్లో, తెల్గాపూర్ శివారులో 150 ఎకరాల్లో, ముగ్దుంపూర్ శివారులో 10 ఎకరాల్లో, సింగితం శివారులో 350 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటపొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. గాలీపూర్ గ్రామ సర్పంచ్ లక్ష్మారెడ్డి, క్లస్టర్ ఏఈవో గ్రీష్మ ఉన్నారు.



గాంధారిలో పంటనష్టం వివరాలు సేకరిస్తున్న అధికారులు



గాలీపూర్‌లో పరిశీలిస్తున్న అధికారులు

సంక్షిప్తం

'ఉపాధి' పనులకు రెగ్యులర్‌గా హాజరుకావాలి

మాచారెడ్డి: ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడుతున్న పనులకు కూలీలు రెగ్యులర్‌గా హాజరు కావాలని మాచారెడ్డి ఎంపీడీవో బాలక్రిష్ణ సూచించారు. గురువారం భవానీపేటలో కూలీల హాజరును తనిఖీ చేశారు.గ్రామ సర్పంచ్ మద్దెల రాజు ఉన్నారు.

అన్నారంలో పనుల పరిశీలన

పిట్లం(జుక్కల్): అన్నారంలో ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీవో వేంకటేశ్వర్‌లు పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ పనులకు సంబందించిన పలు రికార్డులను పరిశీలించారు. ఏపీవో శివకుమార్ పాల్గొన్నారు.

సాయి ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): నెమ్లి గ్రామంలోని శ్రీ షిర్డీ సాయి ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో గురువారం అఖండ హరినామ సప్తాహం జరిగింది. అశోక్ మహరాజ్ ఆధ్వర్యంలో రెండోవ రోజు చైతన్య మహరాజ్ బాలకీర్తలు వినిపించారు. ప్రతి రోజు కాకడ హారతి, ప్రవచనాలు, కీర్తనలు, భజన కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కడతల రాజమణి సూచించారు. గురువారం తుక్కోజివాడిలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉప సర్పంచ్ సంగారావు, ఎంపీటీసీ జయశ్రీ రమేశ్ రావు పాల్గొన్నారు.

విఠల్‌వాడితండాలో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): కంటి సమస్యలు ఉన్నవారు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినిమోగం చేసుకోవాలని ఎంపీటీసీ రతన్‌బాయి సూచించారు. గురువారం విఠల్‌వాడి తండాలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు.

నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నూతనంగా చేపడుతున్న ప్లాంటేషన్ పనుల్లో నిబంధనలు పాటించాలని కామారెడ్డి ఫారెస్ట్ డివిజన్ అధికారి(ఎఫ్‌డీవో) గోపాల్‌రావు సూచించారు. తాండూర్ శివారులో చేపట్టిన ప్లాంటేషన్ పనులను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్లాంటేషన్‌లో భాగంగా చేపట్టిన పొదల తొలగింపు, గుంతల తవ్వకం పనులను పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా, కొలతల ప్రకారం పనులు చేయించాలని ఫారెస్ట్ సిబ్బందిని ఆదేశించారు. నాగిరెడ్డిపేట ఎఫ్ఆర్‌వో వాసుదేవ్, డీఎఫ్ఆర్‌వో రవికుమార్, బీట్ అధికారులు నాగరాజు, నవీన్ తదితరులున్నారు.

ఆస్పత్రికి స్థలం కేటాయిస్తూ తీర్మానం

దోమకొండ: మండల కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి స్థలం కేటాయిస్తూ గ్రామ పంచాయతీ పాలకవర్గం గురువారం తీర్మానించింది. సర్పంచ్ నల్లపు అంజలి అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. గ్రామంలోని దేవునికుంటలో ఉన్న సర్వే నెంబర్–1976, 1977లలో ఖాళీ స్థలం 4 ఎకరాల 3 గుంటలు ఇస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేసి, కాపీని వైద్యవిధాన పరిషత్ కమిషనర్‌కు పంపినట్లు సర్పంచ్ అంజలి వివరించారు. ఉపసర్పంచ్ గజవాడ శ్రీకాంత్, వార్డు సభ్యులు, ఈవో సౌజన్య, పాల్గొన్నారు.